# రైతులందరికీ 'రైతుబంధు' ఇవ్వాలి

ములుగు రూరల్, డిసెంబర్ 12: రాష్ట్ర ప్రభుత్వం ఐదు ఎకరాల లోపు భూమి కలిగిన రైతులందరికీ రైతుబంధు పెట్టుబడి సాయం ఇవ్వాలని రైతు సంఘం నాయకుడు గుండెబోయిన రవిగౌడ్ కోరారు. మంగళవారం సర్వాపురం – అంకన్నగూడెం మధ్య ఉన్న బొగ్గులవాగులో పలువురులు జలదీక్ష చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలు సాగు చేస్తున్న రైతులందరికీ పట్టాలు ఇవ్వాలని, పెట్టుబడి సాయం అందించేందుకు 5 ఎకరాల పరిమితి పెట్టాలన్నారు. భూమి లేని పేదలను గ్రామ సభల ద్వారా గుర్తించి కూలీ బంధు పథకం పేరుతో నెలకు రూ.12వేలు అందించాలని కోరారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంట దెబ్బతిని నష్టపోయిన బాధిత రైతులకు పరిహారాన్ని వెంటనే చెల్లించాలని, విద్య, వైద్యంపై ప్రత్యేకంగా దృష్టిసారించాలన్నారు. నాయకులు బిక్కినేని కొండల్‌రావు, తిరుపతి, శ్రీనివాస్, గుండెమీది వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


బొగ్గులవాగులో జలదీక్షతో నిరసన తెలుపుతున్న రవిగౌడ్, నాయకులు

# టీఎన్‌జీవోస్ భూపాలపల్లి సిటీ కమిటీ ఎన్నిక


నూతన కమిటీకి నియామక పత్రాన్ని అందజేస్తున్న బూరుగు రవి

కృష్ణకాలనీ, డిసెంబర్ 12: జయశంకర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ నాన్‌గెజిటెడ్ ఆఫీసర్స్ (టీఎన్‌జీవోస్) కార్యాలయంలో మంగళవారం జిల్లా అధ్యక్షుడు బూరుగు రవి కుమార్, కోశాధికారి అడ్డూరి దశరథ రామారావు ఆధ్వర్యంలో టీఎన్‌జీవోస్ భూపాలపల్లి సిటీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పోలు ప్రవీణ్ కుమార్, సెక్రటరీగా సంగ విజయ్‌బాబు, కోశాధికారిగా ఏ వినత్, ఉపాధ్యక్షులుగా వీ చంద్రమోహన్, సుకుమార్, జాయింట్ సెక్రటరీలుగా ప్రకాశ్, సీహెచ్ విజయ్‌కుమార్, మహిళా విభాగంలో జాయింట్ సెక్రటరీలుగా ఎం సుమలత, ఆర్గనైజింగ్ జీ.ప్రసాద్, ఎస్ ప్రశాంత్, పబ్లిసిటీ సెక్రటరీగా మాయిస్ నవాజ్‌ఖాన్, ఈసీ సభ్యులుగా ప్రవల్లిక, శివను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నూతన కమిటీని ఆమోదించి ఎన్నికైన సభ్యులందరికీ నియామక పత్రాలు అందజేశారు. జిల్లా కమిటీ సభ్యులు వంశీకృష్ణ, మోతె వేణు, తిరుపతిరెడ్డి, రాజు, సాయికృష్ణ, జిల్లాలోని అన్ని శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

# 15న దివ్యాంగులకు జిల్లా క్రీడా పోటీలు

**జిల్లా సంక్షేమ శాఖ అధికారి నాగేశ్వర్‌రావు**

కృష్ణకాలనీ, డిసెంబర్ 12: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జయశంకర్ జిల్లాలోని దివ్యాంగులకు ఈనెల 15వ తేదీన స్థానిక అంబేద్కర్ క్రీడా మైదానంలో జిల్లా స్థాయి ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఈరెల్లి నాగేశ్వర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని రకాల దివ్యాంగులకు 10 నుంచి 16 ఏండ్లవారికి జూనియర్స్, 17 నుంచి 35 ఏండ్ల వారికి సీనియర్స్ విభాగంలో పరుగుపందెం, షార్ట్‌పుట్, క్యారమ్, చెస్, జావెలిన్‌త్రో, వీల్‌చైర్, ఆటలు నిర్వహించనున్నట్లు వివరించారు. క్రీడల్లో పాల్గొనే దివ్యాంగులు సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డులు జిరాక్స్‌లు తీసుకొని రావాలని డీడబ్ల్యూవో సూచించారు.

# దివ్యాంగులపై సానుభూతితో ఉండాలి

## భూపాలపల్లి ఏరియా సింగరేణి జీఎం బళ్లారి శ్రీనివాస రావు

భూపాలపల్లి రూరల్, డిసెంబర్ 12: దివ్యాంగుల సామాజిక, ఆర్థిక భద్రత, హక్కుల కోసం అనేక చట్టాలు ఉన్నాయని భూపాలపల్లి ఏరియా సింగరేణి జీఎం బళ్లారి శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కృష్ణకాలనీ అంబేద్కర్ స్టేడియంలో భూపాలపల్లి పట్టణం, చుట్టుపక్కల గ్రామాల్లోని పాఠశాలల్లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా డిసెంబర్ 3న దివ్యాంగుల దినోత్సవం నిర్వహిస్తారని తెలిపారు. దివ్యాంగులపై సానుభూతి కలిగి ఉండాలని, వీరి జీవన విధానాన్ని మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం ఆటల పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన దివ్యాంగ విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఏరియా అధికారి ప్రతినిధి అజ్మీరా తుకారాం, డీవైపీఎం జీ రాజు, స్టోర్స్ సూపర్‌వైజర్ పర్స శ్రీనివాస్, హెచ్‌ఎంఆర్‌డీఎస్ వ్యవస్థాపకురాలు రజిత పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న జీఎం బళ్లారి శ్రీనివాస్‌రావు

# తహసీల్దార్ ఆఫీస్‌ను సందర్శించిన ట్రైనీ కలెక్టర్

రేగొండ, డిసెంబర్ 12: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ట్రైనీ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ మంగళవారం సందర్శించారు. తహసీల్దార్ కార్యాలయంలో సంబంధిత ఫైళ్లు, రికార్డులను పరిశీలించారు. తహసీల్దార్ సత్యనారాయణ స్వామిని వివిధ రికార్డుల వివరాలు, సిబ్బంది విషయాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ ఫైళ్లు ఫార్వర్డ్ చేయడం, భూరికార్డుల రిజిస్ట్రేషన్లు, ఫైళ్లు తయారు చేయడంపై క్షుణ్ణంగా అడిగి తెలుసుకుంటూ రికార్డులను పరిశీలించారు.

# కేటీకే ఓసీ-3లో సమగ్ర వైద్యశిబిరం

గణపురం, డిసెంబర్ 12: భూపాలపల్లి సింగరేణి ఏరియా ఆస్పత్రి వైద్యులు ఈనెల 11, 12 తేదీల్లో మండలంలోని బస్వరాజ్‌పల్లి కేటీకే ఓసీ-3 ప్రాజెక్టులో ఉద్యోగులకు హైపర్ టెన్షన్, డయాబెటీస్ తదితర అనారోగ్య సమస్యలపై సమగ్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఏరియా ఆస్పత్రి వైద్యబృందం సహకారంతో డాక్టర్ రవి నేతృత్వంలో వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. పీవో ఎన్వీరావు, ప్రాజెక్టు మేనేజర్ భానుప్రసాద్, మేనేజర్ ఆపరేషన్స్ రాంబాబు, సీనియర్ పర్సనల్ అధికారి సాయికృష్ణ, ఏరియా సేఫ్టీ అధికారి జీఎల్ ప్రసాద్ పాల్గొన్నారు.


శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు


నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**

★I, KADAKANCHI SWARUPA, W/o. KADAKANCHI MADHUSUDHAN (New Name), previously called KADAKANCHI SWARUPA RANI (Old Name), and R/o. H.No. 2-7-13/1, Kurmawada, Jangaon Town and Mandal, Jangaon District, T.S., India. and solemnly declare, Both are Same.
NTW-00

**WANTED**

★ రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1)
శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**For Classified Ads**
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
9182777213
WARANAGAL
9182777556
9182777557
9182777558
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565


# పాపం భద్రు

**తన స్థాయికి మించి ఎవరైనా కష్ట పడుతుంటే అయ్యో 'ఈ కష్టం పగోడికి కూడా రావొద్దు' అని జాలి చూపుతాం. అతడికి అంతో ఇంతో సాయం చేయాలనుకుంటం. సరిగ్గా చదువు కోసం పడరాని పాట్లు పడుతున్నాడు నర్సింహులపేట మండలం పడమటిగూడెం గ్రామ పరిధిలోని గ్యామతండాకు చెందిన ఈ 23ఏళ్ల అజ్మీరా భద్రు. నాన్న లేడు.. అమ్మ ఉన్నా మానసిక దివ్యాంగురాలు.. ఇల్లు లేదు.. వాకిలి లేదు. అయినా మొండి ధైర్యంతో చదువుకుంటున్న ఆ యువకుడికి జాయింట్ సెల్ ట్యూమర్ వ్యాధి సోకింది. కీళ్ల మధ్య కంతులు ఏర్పడడంతో లేచి నిలబడలేని, నడవలేని దుస్థితి. చదువుకోవాలనే కోరిక ఉన్నా ఆరోగ్యం సహకరించక నరకం చూస్తున్నాడు. దాతలు ముందుకొచ్చి ఆదుకోవాలని కన్నీటి పర్యంతమవుతున్నాడు.**


గ్యామతండాలో ఓఇంటి వద్ద చదువుకుంటున్న భద్రు

- **జాయింట్ సెల్ ట్యూమర్ వ్యాధితో నరకం**
- **కీళ్ల మధ్యలో కంతులతో నడవలేని దుస్థితి**
- **చిన్నతనంలో నాన్న వదిలేశాడు.. అమ్మ మానసిక దివ్యాంగురాలు**
- **అమ్మమ్మ ఇంటి వద్దే విద్యాభ్యాసం**
- **చదువుపై మక్కువ ఉన్నా సహకరించని ఆరోగ్యం**
- **లక్షలు ఖర్చుచేసినా నయం కాని రోగం**
- **ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు**

నర్సింహులపేట, డిసెంబర్ 12 : మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం పడమటిగూడెం పరిధిలోని గ్యామతండాకు చెందిన అజ్మీరా సుగుణకు భద్రు ఒక్కడే సంతానం. సుగుణ మానసిక దివ్యాంగురాలు. భద్రు చిన్నతనంలో తండ్రి వదిలేయడంతో తల్లితో కలిసి అదే తండాలో అమ్మమ్మ ఇంటి వద్ద పెరిగాడు. కడుపేదరికంలో ఉన్నా చదువుపై మక్కువతో ఇంటర్ పూర్తి చేశాడు. ఒకటి నుంచి 5వ తరగతి వరకు గ్యామతండాలో, ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు దంతాలపల్లి ఎస్టీ హాస్టల్‌లో పూర్తి చేశాడు. తర్వాత 2017–18లో జీఎంఆర్ ఆదిలాబాద్‌లో పాలిటెక్నిక్ చదువుతున్న సమయంలో జాయింట్ సెల్ ట్యూమర్ వ్యాధి సోకింది. కీళ్ల మధ్య కంతులు ఏర్పడి నడవలేని పరిస్థితి వచ్చింది. చుట్టుపక్కల వాళ్లు తలా కొంత పోగు చేసి ఆపరేషన్ చేయించినా ఫలితం లేకపోయింది. చదువుపై మక్కువతో మొండి ధైర్యంతో తొర్రూరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. ప్రస్తుతం అతడి పరిస్థితి దారుణంగా మారింది. కళాశాలకు వెళ్లేందుకు డబ్బులు లేక, తండాలో నిలువ నీడలేక స్థానిక పాఠశాల, తండాల్లోని పలువురి ఇండ్లలో తలవాల్చుకుంటున్నాడు. ఇంత ఇబ్బంది ఉన్నా అధైర్యపడకుండా ఇంటర్ చదువున్న సమయంలో పెద్దముప్పారంలోని అమ్మఒడి వృద్ధాప్య ఆశ్రమంలో సోషల్ వర్కర్‌గా పనిచేశాడు. కానీ, వ్యాధి ముదిరి లేచి నిలబడలేని, నడవలేని పరిస్థితిలో నరకం చూస్తున్నాడు. నడిచేందుకు ఇతర వ్యక్తుల సాయం అవసరమవుతున్నదని కన్నీటి పర్యంతమవుతున్నాడు. భద్రుకు మైరుగైనవైద్యంతోపాటు చదువుకునేందుకు, ఇల్లు కట్టుకునేందుకు ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్నాడు. సహాయం చేయదలుచుకున్న దాతలు ఫోన్ నంబర్ 9959408173 ద్వారా సహకరించాలని వేడుకుంటున్నాడు.